# తృప్తి

రైల్లో ప్రయాణం చేస్తూ కూడా టెలిగ్రాం చూచుకున్న ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు, విశాల.

మధ్యాన్నం నాన్నకి జవాబురాస్తూ కూర్చుంది. "నాన్నా! మీ ఉత్తరం అందింది. ఇంట్లో పనుల మూలంగా వెంటనే జవాబు రాయలేకపోయాను. మీరు వెళ్ళిన రాత్రి నా నాటకం రేడియోలో వచ్చింది. మీరూ, అమ్మా వాళ్ళంతా విన్నామని రాశారు. నటీనటులు చక్కగానే చేశారనిపించింది ...."

ఉత్తరం రాస్తూ వుండగానే తలుపు చప్పుడైతే కలం కిందపెట్టి లేచివెళ్ళి తలుపు తీసింది. టెలిగ్రాములు అందుకోవటం కొంచెం అలవాటే కాబట్టి, గాభరా పడకుండానే అందుకుని విప్పింది. చదివింది. రెండోసారి చదివింది, నాలుగోసారి చదివింది. అక్షరాలు కన్పించకుండా పోయాయి. కళ్ళు చీకట్లు కమ్మాయి. గుండెలు బరువెక్కి పోయాయి. టెలిగ్రామ్ గుప్పెట్లో ఇరుక్కుంది.

నాన్న వెళ్ళి వారం రోజులుకూడా అవలేదు. ఇదా వార్త! వరండాలో నేలమీద కూర్చుండిపోయింది విశాల.

శేఖరం ఇంట్లోకి వచ్చి, స్థాణువులా కూర్చున్న విశాల చేతుల్లోంచి కాయితం తీసి చూచి నిశ్చేష్టుడయ్యాడు. విశాలకేసి చూడలేకపోయాడు. ఇదేమిటి! ఇంత తొందరగానా! మొన్నేగా వెళ్ళారు!

రైల్లో కూర్చున్న తర్వాత ఎంతో సేపటికిగానీ తను ప్రయాణం చేస్తోన్న సంగతి తెలీలేదు విశాలకి. అప్రయత్నంగా శేఖరంకేసి చూసింది.

"మామయ్య వయసు డెబ్భై కూడా నిండలేదే! ఆరోగ్యం కూడా చాలా మంచిది. ఇదేమిటి, ఇలా జరిగింది?" అన్నాడు శేఖరం.

విశాల మాట్లాడలేదు, కళ్ళు మళ్ళీ నిండాయి.

"బాధ పడకు, ఏమీ చెయ్యలేం."

"...................."

"మతిపోయి చెపుతున్నాను. కన్నతండ్రి పోయాడన్న కబురు తెలిస్తే బాధ వుండదూ?"

నిజంగా ఆ వార్త విశాలకి నమ్మశక్యంగా అనిపించ లేదు. ఇంత అకస్మాత్తుగా నాన్న పోవటం ఏమిటి? వారం రోజుల కిందట వచ్చి వెళ్ళిన నాన్న .... వెళ్ళి వెళ్ళగానే క్షేమ సమాచారాలతో ఉత్తరం రాసిన నాన్న .... చచ్చిపోవటం ఏమిటి? ఇక నాన్న వుండరా?

"రేపో మాపో మనమూ అంతే!"

విశాల, వెర్రిగా చూసింది అతని మొహంలోకి.

"మన చేతుల్లో లేనిది ఇదొక్కటే!"

అవునా? అంతేనా? ఒక రోజుకి తను చచ్చిపోతుంది. తన భర్త చచ్చిపోతాడు. ఇంకో రోజుకి ....

కిటికీలోంచి దూరంగా చీకట్లోకి చూస్తూ కూర్చుంది, చాలా సేపు. ఉలిక్కిపడ్డ దానిలా తలతిప్పి చూసింది శేఖరంకేసి. విశాల కళ్ళనిండా నీళ్ళు ఉన్నాయి.

"మా అమ్మ ...." అంది దుఃఖంతో.

"ఏమిటి?"

"మా అమ్మ ...."

"అవును, ఆవిడెంతో ఏడుస్తూ వుంటుంది."

"అది కాదు. మా అమ్మని ఇంకా ఏడిపిస్తారు."

"ఎవరు?"

శేఖరానికేం అర్థం కాలేదు.

విశాల అంతకన్న చెప్పలేదు. మాట్లాడకుండా కిటికీ చెక్కలకు మొహం ఆన్చుకుని ఏడ్చింది. ఇప్పుడు నాన్న కోసం కాదు, అమ్మ కోసం!

★ ★ ★

ఆ దరిద్రపు ఘడియలు రానే వచ్చాయి. నాన్న శాశ్వతంగా పోయాడన్న దుఃఖం ఓ ఎత్తూ, అమ్మకి అన్యాయం జరుగుతోందన్న బాధ ఓ ఎత్తూ అయ్యాయి విశాలకి.

తెల్లవారుఝాము మూడు గంటలై వుంటుంది. అత్తా, అక్కా అందరూ లేచారు. చిన్న చిన్న కంఠాలతో మాట్లాడు కుంటున్నారు. ఎక్కడో మారుమూల గదిలో .... చిమ్మచీకట్లో .... కూర్చుని వుంది అమ్మ.

అమ్మని గురించీ, అమ్మకు పట్టబోయే దౌర్భాగ్యం గురించీ, ప్రతీ క్షణం ఆలోచిస్తూనే వుంది విశాల. మరో గంటలోనో .... ఘడియలోనో .... అమ్మ .... 'విధవ' అవుతుంది!

తలుపులు తోసుకుని అక్కయ్య వచ్చింది లోపలికి.

"విశాలా! ఇంకా నిద్రే?"

"లేదక్కయ్యా! నా కసలు నిద్రేపట్టలేదు రాత్రంతా!"

"ఏం నిద్రో వల్లకాడు. బోలెడు తతంగం ఉంది. ఇదిగో ఈ పసుపుగుడ్డ తీసుకో. దీన్ని నీ మంగళ సూత్రానికి కట్టుకో.

"పసుపు గుడ్డేవిటి? ఎందుకదీ?"

"మంగళ సూత్రాలు కన్పించకుండా దీన్ని జాగ్రత్తగా కట్టుకో. అమ్మని చూడ్డానికిరా తొందరగా. ఇలా కూర్చుంటే కాదు. అవతల చాకలి వాళ్ళొచ్చి నించున్నారు. ఏవీ సూత్రాలు, నేనే కడతాను."

"ఉండు. అవి కట్టుకోడం ఎందుకో చెప్పు ముందు."

ఆశ్చర్యంగా చూసింది వరలక్ష్మి. — "ఎందుకేవిటే? అలా కట్టుకోకుండా అమ్మని .... చూడకూడదు."

"చూస్తే ....?"

"అమ్మో! కీడు తగలదూ? ఇంకేమన్నా వుందా?"

"అమ్మ ఈ జాగ్రత్తలన్నీ పడకుండా ఎప్పుడన్నా ఇలాంటి కీడు పనులు చేసిందా? మరి అమ్మకి ఈ దౌర్భాగ్యం ఎందుకు వచ్చింది?"

"బాగుందే! ఎవరి ఖర్మకెవరు కర్తలు?"

"అలాంటప్పుడు ఈ జాగ్రత్తలన్నీ పడి ఏం లాభం? ఈ తతంగాలన్నీ నా కిష్టం లేదు."

అక్కగారితో విశాల అప్పటికి వారం రోజుల్నించీ అలాంటి మాటలు అంటూనే వుంది. అమ్మకి అలాంటి వేవీ చెయ్యొద్దని వాదిస్తూనే వుంది.

"అమ్మో! పెద్ద వాళ్ళు ఊరుకుంటారా? అత్తయ్య అసలే ఒప్పుకోదు" అంది అక్క చాలాసార్లు.

"ఒకళ్ళు ఒప్పుకునేదేమిటక్కయ్యా? మన అమ్మ సంగతి మనం చూసుకోవాలి. మనిద్దరం గట్టిగా చెప్తే, వాళ్ళేం చేస్తారు?"

"అసలు అమ్మే ఒప్పుకోదు, తెలుసా?"

"అయినా చెపుదాం. గట్టిగా చెపుదాం."

అక్కాచెల్లెళ్ళ మధ్య ఎటూ తేలకుండానే ఆ వారం రోజులూ గడిచిపోయి అసలు సమయం వచ్చేసింది.

ఇప్పుడు తల్లిని విధవని చేసే కార్యక్రమంలో పెద్ద కూతురు ఉత్సాహంగా తిరుగుతోంది. పేరంటాళ్ళందరూ, ఆ బాధ్యతని తమ భుజస్కంధాల మీద మోస్తున్నారు.

అందరూ మంగళసూత్రాలకు పసుపు గుడ్డలు కట్టుకున్నారు. తర్వాత ఆ పేరంటాళ్ళందరూ ఆ విధవ కాబోయే మనిషిని, ఒకసారి చూసి, చెరువు దగ్గిరికి పంపుతారు.

"నేనా పసుపుగుడ్డ కట్టుకోను" అని విశాల అంటే, అక్కగారు ఆశ్చర్యంగా చూసింది.

"కొంపదీసి పసువు గుడ్డ కట్టుకోకుండా వస్తావా ఏమిటి?" అంది.

"లక్ష్మీ" అంటూ వచ్చింది వెంకాయమ్మత్త.

"ఏవిట్రా పెళ్ళింట్లో ముచ్చట్లాడుకుంటున్నట్టు కబుర్లూ మీరూనూ. ఎవడైనా చూస్తే నవ్వుతాడు. తొందరగా బైటికి రండి. అందరికీ పసుపుగుడ్డ లిచ్చావా లక్ష్మీ?" అంది వరలక్ష్మితో.

"ఇస్తున్నాలే" అంటూ వరలక్ష్మి వెళ్ళిపోయింది.

విశాల, కూర్చున్న చోటునించి లేవలేదు.

"విశాలా! లేచి వెళ్ళవే! మీ అమ్మ అందచందాలు కళ్ళారా చూసుకోండి! ఆట్టే పొద్దు లేదు. చీకటి వుండగానే చెరువునించి తిరిగి రావాలి. వెళ్ళి చూడు తొందరగా. సూత్రాలకి గుడ్డకట్టుకున్నావా?"

ఆవిడ మాటలు వింటోంటే, విశాలకి అసహ్యం ముంచుకొచ్చింది. పచ్చగా వుండే ఆడ మనిషిని మోడుని చెయ్యడానికి ఈ ఆడవాళ్ళకి ఎంత సంబరమో! ఈ అత్తకి ఇలాంటివన్నీ మరీ ముచ్చట! "అలా చెయ్యకపోతేనేం అత్తయ్యా? నేను ఎన్నిసార్లో చెపుతున్నాను. అవన్నీ ఎందుకు చెయ్యాలి?"

"అవన్నీ ఏమిటే?"

"అదే, అమ్మని చెరువు దగ్గరికి తీసికెళ్ళి .... ఎందు కదంతానూ?"

"ఇది మరీ బాగుంది. ఇవ్వాళ మీ అమ్మ నొసటే పొద్దు పొడిచిందా? పట్టుమని పది నెలలు కాలేదు.

నా ఖర్మ కాలిపోలేదూ?"

"అందుకే అత్తయ్యా! ఆ బాధ నీకు మరీ తెలియాలి. ఇలా ఒక ఆడ మనిషిని పదిమందీ కలిసి అవమానం చెయ్యటం ధర్మం కాదు."

"ఎవళ్ళు చేసే దేముందమ్మాయ్? భగవంతుడే చేశాడు."

"భగవంతుడేం చెయ్యలేదు. అన్నీ మనమే చేసుకుంటున్నాం" ఆవేశంగా అంది విశాల.

"ఇవ్వాళ మనం పెట్టుకున్నామా? ఏనాడో పెట్టారు. మొగుడుపోయిన ఆడదానికి ఇంకా రంగులూ, పింగులూ ఎందుకమ్మా? గాజూ పూసా తీసేసుకోటం మన ఆచారం."

విశాలకి ఒళ్ళు మండిపోయింది — "పూర్వ కాలంలో ఇంకా చాలా ఆచారాలుండేవి. మొగుడు చచ్చిపోతే ఆ చితిమీదే ఆడదాన్నికూడా పడేసి చంపేసే వారు. ఆ రోజుల్లో, నీలాంటి వాళ్ళంతా, 'మొగుడు చచ్చిన ఆడది ఇంకా బతకటం ఎందుకూ' అనే వారేమో! ఆ ఆచారం ఈ నాడు కూడా వుంటే, అమ్మని మీరందరూ తగలబెట్టి చంపేస్తారు కూడా. అమ్మ కన్నా ముందు నిన్నూ చంపేసే వారే!"

"పోనీలే, అదే మంచిది. ఈ వెధవ ముండ బతుకు బతుకుతూ నలుగురి మధ్య తిరగడం కన్నా కట్టుకున్నవాడితో పాటే పోతే అంతకన్నా ఏం కావాలి?

అబ్బా! ఏం మనిషి! ఈ మూర్ఖురాలు చితి ఎక్క మన్నా ఎక్కేదేనేమో!

"అత్తయ్యా! మొగవాళ్ళకి భార్యలుపోతే, వాళ్ళని భార్యలతోపాటు తగలబెడతారా? మొగవాళ్ళ ఒంటి మీద ఈ వికారాలన్నీ చేస్తారా? ఆడవాళ్ళకి ఎందుకు చెయ్యాలి ఇవన్నీ? మనం ఆడవాళ్ళమే కదా? మన గురించి మనం ఆలోచించుకోవద్దా?"

వెంకాయమ్మ కేమీ అర్థం కాలేదు. "ఏమిటో అమ్మాయ్! నువ్వు చదువుకున్న దానివి. నీతో మాట్లాడ్డం నాకేం తెలుస్తుంది? పోనీ ఆఖరిసారి పసుపు కుంకాలతో మీ అమ్మ మొహం చూసు కుంటావని పిలవటానికొచ్చాను. నీ ఇష్టం మరి."

"ఒద్దత్తయ్యా! అమ్మకి అవన్నీ చెయ్యొద్దు!"

విశాలకి, చేతకాని వాళ్ళకి వచ్చినంత ఏడుపు వచ్చింది.

వెంకాయమ్మత్త వెళ్ళిందో లేదో, సుందరమ్మత్త వచ్చింది. "విశాలా! ఏమిటీ నీ తలతిక్క? లేచిరావేం?" అంటూ "నీ పిచ్చిగానీ ఇవ్వాళ నువ్వూ నేనూ కాదను కుంటే సరిపోతుందామ్మా? పదిమందీ నవ్వరూ?" అంది మందలింపుగా.

విశాలకి చెప్పలేనంత చిరాకేసింది — "పదిమందీ అంటే ఎవరో ఎక్కడో వుండరు. ఇప్పుడు, ఈ ఇంట్లోనే పది మంది పేరంటాళ్ళున్నారు. వీళ్ళంతా ఆపాలంటే ఈ ఆచారం ఆగదా? — అత్తయ్యా! రేపు ఇలాంటి కష్టం నాకూ రావచ్చు, నీకూ రావచ్చు. అప్పుడు మనం ఎంత ఏడుస్తాం!"

"చాల్లే, నీ మాటలూ నువ్వూనూ. కన్న తండ్రిమీద అభిమానం వుంటే, ఇలాంటి మాటలు మాట్లాడ తావా?"

"అత్తయ్యా! అమ్మని విధవని చేయటం నాన్న మీద అభిమానం చూపించటమా?"

"కాకపోతే ఏమిటే? నాన్న పోయాక కూడా మీ అమ్మ షోకులు చేసుకుని తిరగాలంటే .... నీకుమాత్రం ఎబ్బెట్టుగా వుండదూ?" అంటూ సుందరమ్మ రుస రుస లాడుతూ వెళ్ళిపోయింది.

విశాల నిశ్శబ్దంగా కూర్చుంది.

చావిట్లో సందడి ఎక్కువైంది. పేరంటాళ్ళంతా అక్కడ చేరారు.

అమ్మని మారుమూల గదిలోంచి చావిట్లోకి తీసుకొచ్చారు.

ఆవిడ సన్నగా ఏడుస్తోంది. "భగవంతుడా! నన్ను పది మంది మధ్యా నవ్వులపాలు చేశావు. నా బతుకు బండలు చేశావు. నన్ను నా దేవుడితోపాటే తీసుకుపో తండ్రీ!" అంటోంది.

అమ్మ శోకం వింటూ విశాల ఎంతోసేపు కూర్చో లేక పోయింది. నెమ్మదిగా లేచి గదిగుమ్మం దగ్గరకు వెళ్ళి నించుంది. నోటికి పైటకొంగు అడ్డుపెట్టుకుంది.

అమ్మని ఆఖరిసారిగా ముస్తాబు చేశారు. ఎర్రటి చీర — పచ్చటి రవికె — పాదాలనిండా పసుపు — నుదుట కుంకుమ బొట్టు — ముడినిండా పువ్వులు — చేతులనిండా గాజులు — పైటకొంగులో ఒడికట్టు బియ్యం — పండుముత్తైదువులా వున్న అమ్మ మొహం అవమాన భారంతో కళావిహీనంగా వుంది.

తలెత్తి ఎవ్వరికేసి చూడలేక తల భూమిలోకి దించుకుని కూర్చుంది.

అమ్మకి అంత ముస్తాబు చేసి ఇప్పుడు మంచం సవారీతో చెరువు దగ్గిరికి తీసుకుపోతారు. అక్కడేం చేస్తారు? అదంతా ధ్వంసం చేస్తారు! గాజులు బద్దలు కొడతారు. జుట్టులోంచి పువ్వులు పీకుతారు. బొట్టు చెరుపుతారు. సూత్రాలు తెంపుతారు. రంగుచీర ఊడదీసి తెల్లచీర మీద పడేస్తారు. అవన్నీ చేస్తోంటే ఆ మనిషికి ఎలా వుంటుంది? ఎంత హింస అనుభవిస్తుంది!

అమ్మని అలా చేస్తోంటే తనుచూస్తూ ఊరుకోవాలా?

"ఇంకా ఆలస్యం ఏవిటర్రా?" అంటూ రంకె వేసింది సుందరమ్మ.

"ఓసే ఎంకీ! లేవదీసికెళ్ళు! చెయ్యిపట్టుకో!" అంటూ వంతపాడింది వెంకాయమ్మ.

ఒకరోజు తననీ ఇలా చేశారన్న సానుభూతి లేదు వెంకాయమ్మకి! ఏదో రోజు తననీ ఇలా చేస్తారేమోనన్న జంకులేదు సుందరమ్మకి!

ఎంకి, అమ్మ చెయ్యి పట్టుకుంది.

అమ్మ జీవచ్ఛవంలా లేచింది.

"అమ్మా! అమ్మా! వొద్దు! వెళ్ళొద్దు!" అంటూ ఏడుస్తూ వెళ్ళి విశాల అమ్మ కాళ్ళమీద పడింది.

"అమ్మా! వొద్దు! నేను రానని చెప్పు! నీ మీద పెత్తనం చేసే హక్కు ఎవరికీ లేదు. ఇదంతా నువ్వు పాటించొద్దు! అమ్మా! నువ్వు ఇలాగే ఉండు! కలకల్లాడుతూ ఉండు! వెళ్ళొద్దు!"

ఆ మాటలు విశాల, ఆ వారం రోజుల్లో అమ్మతో ఎన్నిసార్లందో! అమ్మా, ప్రతీసారీ తెల్లబోతూనే చూసింది.

అమ్మ మళ్ళీ తెల్లబోయింది. కొంచెంసేపు కొయ్యబారి నిలబడింది. కూతుర్ని దగ్గిరికి తీసుకుని తల నిమి రింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ ఎంకి చెయ్యిపట్టు కుని నడిచింది.

విశాల కుప్ప కూలిపోయింది. వలవలా ఏడ్చింది.

నాన్నని తీసుకుపోయింది — ప్రకృతి. దాన్ని ఆపలేం. కానీ, ఇది ప్రకృతి పని కాదు. తోటి మనుషుల పని, హృదయంలేని కిరాతకుల పని! ఆలోచించలేని మూర్ఖుల పని!

"నీ భర్తతోటే నీ అందచందాలు పోయాయి. నీ కడుపుకో పట్టెడు తిండీ, శరీరానికో మూరెడు గుడ్డా చాలు. నీ ఖర్మ ఇలా కాలిందనుకో" అంటూ చెర్లో నీళ్ళుతెచ్చి నెత్తిమీద గుమ్మరిస్తారు.

అమ్మ పుణ్యస్త్రీత్వం నీళ్ళపాలై పోతుంది. అమ్మ విధవ అవుతుంది! విధవ! అమ్మ అలా తిరిగి వస్తుంది.

అమ్మని ఎలా చూడాలి? ఎంత సిగ్గుపడి పోతుందో!

అమ్మని ఇంటికి తెచ్చేశారు. మూలగదిలోకి పంపించారు.

హడావిడిగా లోపలకు వచ్చింది వరలక్ష్మి. "విశాలా! తెల్లవారిపోతోందే! మొహం కడుక్కుని స్నానం చేసివచ్చి కూర్చో. మళ్ళీ అమ్మని చూడ్డానికి వెళ్ళాలి" అంటూ అంత హడావిడిగానూ వెళ్ళి పోయింది.

నీరసంగా లేచి బయటకి వెళ్ళింది విశాల. ఇల్లూ వాకిలీ నానా గందరగోళంగా వున్నాయి. వాకిట్లో గాడి పొయ్యిలు భగభగా మండుతున్నాయి. అన్నాలూ కూరలూ కాఫీలూ టిఫెన్లూ చకచకా తయారౌతున్నాయి. ఎవళ్ళకి వాళ్ళే హడావిడి పడిపోతున్నారు. పిల్లలంతా చేటలో జీడిపప్పు తినటానికి దెబ్బలాడుకుంటున్నారు.

విశాల ఒక్కతీ నిమ్మకి నీరెత్తినట్టు ఒక స్తంభాన్ని ఆనుకుని నుంచుంది ఎంతోసేపు. తెప్పరిల్లిన దానిలా గబగబా మొహం కడుక్కోటానికి వెళ్ళింది. స్నానంచేసి లోపలికొచ్చింది. ఏదో గుర్తు వచ్చినదానిలా వరలక్ష్మి కోసం వెతికింది.

"అక్కయ్యా! అమ్మ కాఫీ తాగిందా?"

"నెమ్మదిగా మాట్లాడు బాబూ! అత్తయ్య వింటే తిడుతుంది."

"అమ్మ కాఫీ తాగిందా అంటే అత్తయ్య తిట్టడం ఏమిటి?"

వరలక్ష్మి అరిటాకుల్లో ఉప్మా సర్దిపెడుతూ అంది "అమ్మ ఇప్పుడు ఏమీ తినకూడదట, బ్రాహ్మలకి పొత్తర్లవీ ఇచ్చి మళ్ళీ స్నానం చేయించేదాకా."

"ఛీ! నీ కన్నా బుద్ధిలేదూ? ఆ వెధవ తతంగాలన్నీ

ముగిసేసరికి అమ్మకి ప్రాణాలుపోతాయి. అసలే పుట్టెడు రోగంతో వుంది."

"నా మీద విరుచుకు పడతా వెందుకూ? కావాలంటే అత్తయ్య నడుగు వెళ్ళి."

"నే నెవర్నీ అడగను. కొంచెం ఉప్మా కాఫీ ఇలా ఇయ్యి!"

"మతివుండే మాట్లాడుతున్నావా? ఒక మూల ఏడుస్తూ కూర్చున్న మనిషి, ఇప్పుడు ఉప్మాలూ, కాఫీలూ ఆరగిస్తుందా?"

తెల్లబోయింది విశాల — "అమ్మ కాఫీ తాగితే నువ్వే తప్పు పట్టేలా వున్నావే!"

"ఏమో బాబూ! అవన్నీ నాకు తెలీవు. పెద్ద వాళ్ళేవో చెప్పారు. నే నలాగే చేస్తాను. నా భయం నాది. మా అత్తగారికి తెలిస్తే చెడామడా తిట్టిపోస్తుంది."

"అబ్బా! అత్తగారికి చాలా భయపడి పోతున్నావు."

"ఏం, భయపడక? పెద్దవాళ్ళ మాటకి ఎదురు తిరుగుతాననుకున్నావా?"

విశాల ఇంకేం మాట్లాడలేదు. కాఫీల దగ్గిరికి వెళ్ళి ఒక గ్లాసునిండా కాఫీ ఒంచుకుని వేడి గ్లాసు పైట కొంగుతో పట్టుకుని వరండాలోంచి అమ్మవున్న గదికేసి బయల్దేరింది.

సామాను గదిలో బియ్యంకొలిచి ఇస్తోన్న సుంద రమ్మ గబగబా బైటికి వస్తూ "ఒసే విశాలా! ఎక్కడికే? అటుగాని వెళ్తున్నావా? మీ అమ్మని ఇప్పుడు చూడ కూడదే" అంటూ గావుకేక పెట్టింది.

విశాల తిన్నగా కొట్టుగది ముందుకు వెళ్ళి తలు పులు మీద చెయ్యి వేసింది. గుండె ఆగినట్టయింది. లోపల గడియపెట్టివుంది.

"అమ్మా! ఒక్కసారి .... తలుపు తియ్యి!"

సుందరమ్మ రుసరుసలాడుతూ వచ్చింది. గొంతు తగ్గించి కోపంగా అంది "చాల్లేవే నీ చోద్యాలూ నువ్వూనూ. ఎవరైనా వింటే నవ్విపోతారు. ఒక్కపూటకి తిండి లేకపోతే చస్తారా ఏమిటి? ఇప్పుడు కాఫీ తాగాలా?"

విన్పించుకోలేదు విశాల. తలుపుమీద దబదబా బాదింది — "అమ్మా! ఒక్కసారి తియ్యవే!"

"ఒసే! నీకే చెప్పేది. అంత పెంకితనం పనికి రాదు. మళ్ళీ స్నానం చేయించి దీపారాధన చేసేవరకూ దాని మొహం ఎవ్వరూ చూడకూడదు. అసలు నీ సూత్రాలకి పసుపు గుడ్డ కట్టుకున్నావా?"

విశాలకు పుట్టెడు కోపం వచ్చింది. గిర్రున తల తిప్పి "అత్తయ్యా, నువ్వు నా జోలికి రాకసలు" అంది కోపంగా.

తెల్లబోయింది సుందరమ్మ.

"నువ్వెన్ని చదువులు వెలగబెట్టినా .... కాస్త తప్పొ ఒప్పొ వుంటాయమ్మా!" అంది రుసరుసలాడుతూ.

"తప్పా! మా అమ్మ మొహం నేను చూడటం తప్పా! అసలు అమ్మ ఏం తప్పు చేసిందని .... ఇలా వెలివేశారు మీరందరూ?"

"తప్పు చేసిందని ఎవరన్నారే? అదో ఆచారం. ఇవ్వాల్టికి నువ్వు బైల్దేరావు అందర్నీ వెక్కిరించటానికి."

"అత్తయ్యా! అనవసరంగా నోరు చేసుకోకు. మా అమ్మకి అసలే ఒంట్లో బాగాలేదు. కొంచెం కాఫీ ఇస్తే మీ ఆచారాలకేం నష్టం రాదు."

విశాల మళ్ళీ తలుపు తట్టి పిల్చింది "అమ్మా! ఒక్కసారి తలుపుతియ్యి! నేను నిన్ను చూడను లేవే! కాఫీ గ్లాసు గడపలో పెట్టి వెళ్ళిపోతాను. అమ్మా! తలుపుతియ్యి."

తలుపులు తెరుచుకోలేదు. విశాలకు గొంతు నిండా దుఖ్ఖం వచ్చింది.

నిలబడి నిలబడి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

చావిట్లో బ్రాహ్మల మంత్రాల తతంగం ప్రారంభ మైంది. ఆడా మొగా, చిన్నా పెద్దా అంతా అక్కడ చేరారు.

చచ్చిపోయిన నాన్న ఆత్మశాంతికోసం పూజలు జరుగుతున్నాయి.

ఇన్నాళ్ళూ మనకు తెలిసిన మనిషి, మనతో బతికిన మనిషి, ఇక లేదు — అని నలుగురూ చేరి ఆ మనిషి గురించి మంచీ చెడ్డా మాట్లాడుకోడానికే, ఆ సందర్భం! దాని కోసం ఈ పూజలూ, ఈ మంత్రాలూ, ఇవన్నీ ఎందుకూ? ఇంత మంది పెద్దవాళ్ళు వున్నారు ... ఆలోచించరేం? — విశాల ఆ గోలలోంచి గదిలోకి వెళ్ళిపోయింది.

"అబ్బో! అదంతా ముగిసేసరికి మిట్ట మధ్యాన్నం అవుతుంది. పిల్లలకి బంతులు వేసెయ్యండి!"

"నాకూ రెండు మెతుకులు పడెయ్యవే, ఉండ

లేను!"

"మళ్ళీ వచ్చి చూడొచ్చు. వెళ్ళి తిళ్ళు తినండర్రా!"

ఇల్లంతా భోజనాల హడావుడితో గోలగోలగా వుంది.

విశాల .... తెల్లవార్లూ నిద్రలేదేమో, మంచంమీద ఒరగగానే నిద్రలోకి జారిపోయింది.

★ ★ ★

కొట్టుగది తలుపులు ఎంతకీ రాకపోతే గునపాలతో విరగ్గొట్టాల్సి వచ్చింది. చిన్నా పెద్దా అంతా బిలబిల్లాడుతూ అక్కడ చేరారు.

లోపలికి తొంగిచూసిన చాకలి ఎంకి వెర్రి కేక పెట్టింది.

"ఏవిటే, ఏవిటే, ఏమైంది?" అంటూ పేరంటాళ్ళంతా కంగారుపడ్డారు. చావు కబురు చల్లగా బయటపడింది.

విశాల తల్లి కుప్పలా కూలిపోయి వుంది. ఎక్కడ వాళ్ళక్కడ నిశ్చేష్టులయ్యారు. వరలక్ష్మి గది గుమ్మంలో కూలబడి ఘొల్లుమంది.

విశాల వరండా చివర స్తంభాన్ని ఆనుకుని నిలబడిపోయింది.

అమ్మకి దాహం వేసిందేమో! ఆ గదిలో పుడిసెడు నీళ్ళయినా లేవు. శోష వచ్చిందేమో! గంటల తరబడీ అతీ గతీ లేదు.

బండెడు రోగం నించీ, పుట్టెడు దుఃఖంనుంచీ, విముక్తి పొందింది అమ్మ!

విశాలకి ఏడుపు రాలేదు. అమ్మ అంటే తనకి నిజంగా ప్రేమలేదేమో!

ఎవరో తట్టి లేపుతోంటే తుళ్ళిపడి లేచింది.

"అదేమిటే? నిద్రలో ఏడుస్తున్నావా?" కంగారుపడింది వరలక్ష్మి.

"అన్నంకూడా తినకుండా పడుకున్నావు. మూడు దాటిపోయింది."

కలా! ఎంత పీడ కల! అమ్మకి ఏమీ కాలేదు!

"అక్కయ్యా! అమ్మ బాగుందా?"

"ఏదో వుందిలే"

"అన్నం పెట్టారా?"

"ఏదో తిందిలే."

"మళ్ళీ స్నానం అయిందా?"

"అయిందిలే."

"అమ్మని నువ్వు చూశావా?"

"చూశాను. అందరం చూశాం."

"ఎలా వుంది?"

"ఎలా వుంటుంది? దాని ఖర్మ అలా కాలింది. నువ్వు కూడా వెళ్ళిచూడు. అక్కడే గిన్నిలో అక్షింతలు వున్నాయి. అమ్మ నెత్తిమీద నాలుగక్షింతలు వేసి చెయ్యి కడుక్కో. ఇక తర్వాత ఎప్పుడు చూసినా ఫర్వాలేదు."

మాట్లాడలేదు విశాల — మనసులో ఎంతో ఆనందంగా వుంది. అమ్మ చచ్చిపోలేదు. బతికే వుంది!

వరలక్ష్మి మళ్ళీ అంది — "వెళ్ళి అమ్మని చూసిరా!"

"తెల్ల చీర కట్టుకుందా?"

"ఏదో సైను పంచె కట్టుకుంది. గాజుల్లేవు. బొట్టు లేదు. పువ్వుల్లేవు. మెడలో ఏమీ లేవు. మన అమ్మేనా అనిపించిందే!"

"అమ్మని మళ్ళీ రంగు చీరలు కట్టుకోమని చెపుదాం అక్కయ్యా! గాజులూ బొట్టూ పువ్వులూ అన్నీ పెట్టుకోమందాం."

"అమ్మో! అందరూ ఏమనుకుంటారు?"

"అనుకుంటే అనుకుంటారు. మనం అలాగే చేద్దాం అక్కయ్యా!"

చెల్లెలి మాటలు వింటూ అయోమయంగా చూసింది వరలక్ష్మి. "పోనీగానీ చాకలి వచ్చింది. నీ బట్టలేమైనా వుంటే వెయ్యి" అనేసి వెళ్ళిపోయింది.

విశాల అలాగే కూర్చుంది. తనకి ఊహ తెలిశాక, ఇరవై సంవత్సరాల నించీ అమ్మని తను బాగా ఎరుగును. రంగు చీరలు కట్టుకునే అమ్మ అస్తమానూ గాజులు తొడిగించుకునే అమ్మ ... పావలా బిళ్ళంత బొట్టుపెట్టుకునే అమ్మ .... ఇప్పుడు అమ్మ రూపమే మారిపోయి వుంటుంది!

తనుకూడా అందర్లాగే వుండేదాన్నన్నే సంగతి కొన్నాళ్ళకి అమ్మే మర్చిపోతుంది. అందరికీ, అమ్మకీ, ఇదే అలవాటైపోతుంది.

విశాల, గదిలోంచి గుమ్మం దగ్గిరకి వెళ్ళి "ఎంకమ్మని ఒకసారి ఇలా రమ్మను అక్కయ్యా!" అంది.

"ఎంకీ! విశాలమ్మగారు పిలుస్తోందే! ఎందుకో చూడు" అంటూ వాకిట్లోకి వెళ్ళి కేక పెట్టింది వరలక్ష్మి.

"ఏం, అమ్మాయిగారూ?" అంటూ వచ్చింది ఎంకమ్మ. పండక్కి వచ్చినప్పుడు విశాల ఇచ్చిన సిల్కుచీరే కట్టుకుంది. విశాలంటే ఎంకమ్మకి చాలా ఇష్టం. ఎప్పుడేది అడిగినా ఇస్తుంది విశాల.

"ఎంకీ! నీతో ఒక పనుందే!"

"చెప్పండమ్మా! మీకోక లేవన్నా ఇస్త్రీ చెయ్యాలా?"

"అది కాదే! మా అమ్మ, ఇవ్వాళ తెల్లారుగట్ల కట్టుకున్న ఎర్రచీర నీ దగ్గరే వుందా?"

ఆశ్చర్యపడింది ఎంకి — "అది నేను తీసుకున్నానమ్మా! చెరువుకాడి గుడ్డ చాకల్దానికొస్తది. మీ రెరగరేంటి?"

"అవున్లే! నాకూ తెలుసు. కానీ ఆ చీర నాకు కావాలే ఎంకమ్మా!"

వినకూడని మాట విన్నట్టు గుడ్లు పెద్దవి చేసి చూస్తూ నిలబడింది ఎంకమ్మ.

"నాకేం ఊరికే ఇవ్వొద్దు. డబ్బిస్తాను. ఆ ఎర్రచీర ఇస్త్రీ చేసి తెచ్చిపెట్టు. నువ్వు ఇంకో చీర కొనుక్కో."

ఎంకి తెప్పరిల్లింది — "అదేంటడమ్మాయిగారూ! కీడు గుడ్డ మీ ఇంట్లో ఎలా పెట్టుకుంటారమ్మా?"

"ఫర్వాలేదు. అలాటి నమ్మకాలు లేవు నాకు. అవన్నీ పిచ్చి నమ్మకాలే. ఆ చీర తెచ్చిపెట్టు నాకు."

"అమ్మో! పెద్దోరికి తెలిస్తే నన్ను చీవాట్లెయ్యరా? ఉండండి; పెద్దమ్మగార్నడుగుతాను" అంటూ ఎంకమ్మ విశాల పిలుస్తున్నా వినిపించుకోకుండా కొట్టుగదికేసి వెళ్ళిపోయింది.

★ ★ ★

రైలు పరిగెడుతోంది. విశాల కిటికీ దగ్గర కూర్చుంది బైటికి చూస్తూ. కళ్ళు చెమరుస్తూనే వున్నాయి.

"అంత బాధపడకు, కాలం మారుతుంది" అన్నాడు శేఖరం చాలాసార్లు.

"నా ఆలోచనలెందుకూ కొరగాకుండా పోయాయి. నేననుకున్నదేమీ చెయ్యలేకపోయాను" అంది విశాల బాధగా.

"వాళ్ళ నమ్మకాలు అలా వున్నాయి" అన్నాడు.

"ఏం నమ్మకాలు? అంత మూర్ఖంగానా? మా అమ్మ ఆ రోజున కట్టుకున్న ఎర్రచీర నా దగ్గిర వుంచుకుందామనుకున్నాను. ఎంకమ్మకి మా అమ్మే చెప్పిందట ఇవ్వొద్దని! కీడు... కీడు... కీడు...! కొంచెం కూడా ఆలోచించరు. ఎప్పటికి మారతారు?"

"మారతారు తప్పకుండా! వెనకటి కాలంలో వుండే ఎన్నో ఆచారాలు పోతున్నాయి. మీ నాన్నతో పాటే మీ అమ్మ కూడా చచ్చిపోవాల్సిన రోజులు మారాయా లేదా? భర్త పోగానే భార్యకి తలలు బోడులు చేసే రోజులు మారాయా లేదా? పసిపిల్లలకి ముసలివాళ్ళతో పెళ్ళిళ్ళు చేసే రోజులు మారాయా లేదా? ఇక, ఇది మాత్రం మారకుండా వుండి పోతుందా? ఇంకో పదేళ్ళు పోనీ! ఇదీ మారుతుంది."

విశాల కొత్తగా వింటున్నట్టు కళ్ళు విప్పార్చి సంతోషంగా చూసింది — "నిజమే, మారుతుందేమో! కానీ... ఏమో! ఎందరు మారినా మా అక్క మారుతుం దనిపించడంలేదు."

శేఖరం నవ్వాడు — "కొందరు చాలా ఆలస్యంగా మారతారు. అలాంటిది మీ అక్క!"

"ముందు కొంతమంది మారితే, వాళ్ళు, మిగతా వాళ్ళని కూడా లాక్కుపోతారు!"

"ఆ కొంతమందైనా వున్నారా అని!"

"ఎందుకు వుండరూ? ఇదంతా మారాలని మనం అనుకోడం లేదూ? ఎవ్వరూ లేకపోతే మనమెలా వున్నాం? మనం ఉన్నాం అంటే, మనలాగే ఇంకా కొందరు కూడా వున్నారనుకోవాలి."

విశాల మనసులోంచి పెద్ద బరువు దిగినట్టనిపించింది.

"కాలం మారుతుందా! అందరూ మారతారా!" అంది ఆశ్చర్యపోతూ!

తండ్రిపోయాడని టెలిగ్రామ్ వచ్చిన తర్వాత, విశాల మొహం మీద సంతోషం మళ్ళీ ఇన్నాళ్ళకి చూశాడు శేఖరం.

[1965 'కోమలి' మాసపత్రికలో మొదటిసారి] ★